# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **పౌరసత్వ సవరణ చట్టం అమలుపై భారత్‌లోని ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, హిందువులతో సమానంగా వారి హక్కులు కొనసాగుతాయని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.**

**2.** **ఆధార్ కార్డులో ఉచితంగా మార్పులు, చేర్పులు చేసుకునేందుకు విధించిన గడువును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ మరో మూడు నెలలు పొడిగించింది.**

**3.** **రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని నిరంతరం కొనసాగిస్తున్నామని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2018లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించింది.**

**5.** **కృత్రిమ మేధను వినియోగించి విద్యుత్ డిమాండ్‌ను ముందస్తుగా అంచనా వేసే విధానాన్ని రూపొందించడంలో కృషి చేసిన ఏపీ ట్రాన్స్‌కోకు గోల్డెన్ పీకాక్ అవార్డు లభించింది.**

==========================

పౌరసత్వ సవరణ చట్టం-సీ.ఏ.ఏ. అమలుపై భారత్‌లోని ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదని, హిందువులతో సమానంగా వారి హక్కులు కొనసాగుతాయని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. దేశంలోని 18 కోట్ల మంది ముస్లింలు తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకునేందుకు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని ఒక ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లలో పీడనకు గురైన ముస్లిమేతర మైనారిటీలు 2014 డిసెంబరు 31లోగా మన దేశానికి వచ్చి ఉన్నట్లయితే వారికి మన పౌరసత్వం ఇచ్చే సీఏఏ-2019 చట్ట నిబంధనల్ని తాజాగా ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. భారత పౌరసత్వం కోసం మూడు దేశాల శరణార్థులు దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది. సీఏఏ-2019 కింద అర్హత కలిగిన వ్యక్తులెవరైనా indiancitizenshiponline.nic.in అనే పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని హోంశాఖ తెలిపింది.

------------------------

ఆధార్ కార్డులో ఉచితంగా మార్పులు, చేర్పులు చేసుకునేందుకు విధించిన గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ- యూ.ఐ.డి.ఏ.ఐ తెలిపింది. ఈ ప్రక్రియకు కేంద్రం ఇచ్చిన గడువు ఈనెల 14వ తేదీతో ముగియనుండగా... మరో 3 నెలలు గడువు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సామజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా తెలిపింది. దీంతో జూన్ 14 వరకు ఆధార్‌లో ఉచితంగా మార్పులు

చేసుకోవచ్చు. ఇందుకోసం ఉడాయ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యాక గుర్తింపు కార్డు, చిరునామా వివరాలను సమర్పించాలి. రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, కిసాన్ ఫొటో పాస్‌బుక్, పాస్‌పోర్ట్ వంటివి గుర్తింపు, చిరునామా రెండింటికీ ధ్రువీకరణ పత్రాలుగా వాడుకోవచ్చు. టీసీ, మార్క్‌షీట్, పాన్/ఇ-పాన్, డ్రైవింగ్ లైసెన్సు వంటివి గుర్తింపు ధ్రువీకరణ పత్రంగా ఉపయోగపడతాయని తెలిపింది.

---------------------------

రాష్ట్రంలో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిని నిరంతరం కొనసాగిస్తున్నామని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలోని వాకాడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలు, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జనన, మరణ నమోదు సవరణ చట్టం-2023 పై వెలగపూడి సచివాలయంలో అధికారులతో నిన్న ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో జరిగే జనన, మరణ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని... నకిలీ పత్రాలను నియంత్రించేందుకు పాత రికార్డులను డిజిటలైజ్ చేయాలని అన్నారు. జననాలతో పాటు మరణాలు కూడా గ్రామ, మున్సిపాలిటీల స్థాయిలోను ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు సహా ప్రతిచోటా సకాలంలో సక్రమంగా నమోదయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్రల ద్వారా జనన, మరణ రిజిస్ట్రేషన్ల నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని జవహర్‌రెడ్డి అధికారులకు సూచించారు.

---------------------------

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. రేపు ఉదయం తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కర్నూలు జిల్లా ఓర్వకల్లు చేరుకుంటారు. అక్కడ నేషనల్ లా యూనివర్సిటీకి భూమి పూజ చేస్తారు. అనంతరం నంద్యాల జిల్లా బనగానపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్-ఏపీపీఎస్సీ 2018లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జవాబు పత్రాలను మాన్యువల్ విధానంలో రెండుసార్లు మూల్యాంకనం చేశారని, మొదటిసారి దిద్దిన ఫలితాలను మార్చి, రెండోసారి వచ్చిన ఫలితాల ఆధారంగా ఏపీపీఎస్సీ ఫలితాలు ప్రకటించిందని ఆరోపిస్తూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈరోజు తీర్పు వెల్లడించింది. మెయిన్స్ జవాబు పత్రాలను పలుమార్లు మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసిన ఉన్నత న్యాయస్థానం.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది.

---------------------------

తెలుగు కవయిత్రి, 16వ శతాబ్దానికి చెందిన.. "మొల్ల" పేరుతో సాహితీ ప్రపంచానికి సుపరిచితురాలైన ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మొల్ల జయంతిని అధికారికంగా

నిర్వహిస్తున్న ప్రభుత్వం ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

కృత్రిమ మేధను వినియోగించి విద్యుత్ డిమాండ్‌ను ముందస్తుగా అంచనా వేసే విధానాన్ని రూపొందించడంలో కృషి చేసిన ఏపీ ట్రాన్స్‌కోకు గోల్డెన్ పీకాక్ అవార్డు లభించింది. యూ.ఏ.ఈ.లో మార్చి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగిన కార్యక్రమంలో ట్రాన్స్‌కో జేఎండీ చక్రధరబాబు అవార్డును అందుకున్నట్లు ఇంధన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా గ్రోత్, ఇన్నోవేషన్ అంశాల ప్లీనరీకి ఆయన అధ్యక్షత వహించారు. వినూత్న అప్లికేషన్లు, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్, క్లీన్ ఎనర్జీ ప్రొక్యూర్‌మెంట్ అంశాల గురించి ఆయన వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత డిమాండ్ అంచనా నమూనా అమలుతో గత రెండేళ్లలో కోట్ల రూపాయలు ఆదా చేయగలిగామని ట్రాన్స్‌కో జేఎండీ వెల్లడించారు.

---------------------------

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడమే కాకుండా దేశ అభివృద్ధి కోసం తమ ఓటును వినియోగించుకుంటామని యువ ఓటర్లు అంటున్నారు. యువ ఓటర్లను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న మేరా పెహ్లా వోట్ దేశ్ కే లియే ప్రచారం తిరుపతి జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన యువ ఓటర్లు ఆకాశవాణితో మాట్లాడుతూ...తమ మొదటి ఓటు దేశ అభివృద్ధి కోసమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది కాబట్టి తాము ఓటు హక్కును వినియోగించు కుంటామంటున్నారు.

వాయిస్ - 32 సెకన్లు

---------------------------

తెలంగాణలో వాహనాల రిజిస్ట్రేషన్ మార్క్‌ను టీఎస్ నుంచి టీజీకి మారుస్తూ కేంద్ర రహదారి రవాణా శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 41(6) కింద ఉన్న అధికారాలను ఉపయోగించి.. 1989 జూన్ 12న అప్పటి ఉపరితల రవాణా శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ మార్పు చేసినట్లు తెలిపింది. దీని ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ఇదివరకు ఉన్న టీఎస్ స్థానంలో ఇప్పుడు టీజీ మార్క్ కేటాయించినట్లు వెల్లడించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత వాహన రిజిస్ట్రేషన్ మార్క్‌లో మార్పు చేయాలని రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. దాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం మార్పుచేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో తెలంగాణాలో ఇకనుంచి రిజిస్టర్ అయ్యే వాహనాల మార్క్ టీజీగా మారనుంది.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు నిరుపేదలకు అండగా ఉంటున్నాయని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. చిత్తూరు జిల్లా నింద్ర మండలంలోని నింద్ర గ్రామంలో నాలుగో విడత చేయూతకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నిరుపేదలకు సొంత ఇంటిని రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోందని అన్నారు. అలాగే వైయస్సార్ చేయూత ద్వారా మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్నామని రోజా తెలిపారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన కార్యచరణ రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ, ఇతర అనుబంధ రహదారుల్లో రహదారి ప్రమాదాల నియంత్రణకు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించారదని పేర్కొన్నారు.

=====================